సాక్షి
అనంతపురం
శుక్రవారం ‌। 3 । జనవరి । 2025



టన్ను చీనీ రూ.28,190

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28,190 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.5 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
33.9°/12.6°

జిల్లా అంతటా గురువారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటలకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

8న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 8న నిర్వహించనున్నట్లు జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ) ఆర్. రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సహా ఆయా స్థాయీ సంఘాల అధ్యక్షుల అధ్యక్షతన స్థాయీ సంఘం–1, 2, 3, 4, 5, 6, 7(ఆర్థిక/ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి/ వ్యవసాయం/ విద్య, వైద్యం/మహిళా శిశు, సంక్షేమం/సాంఘిక సంక్షేమం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. గత సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలు, ఇప్పుడు జరగబోయే సమావేశాల్లో సభ్యులు అడిగే సమస్యలకు సంబంధించి సమగ్ర సమాచారంతో అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. ఎవరైనా గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



అనంతపురం మెడికల్: కడప జోన్ పరిధిలోని 150 స్టాఫ్‌నర్సు ఉద్యోగాలను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి కడప ప్రాంతీయ సంచాలకులు నోటిఫికేషన్ జారీ చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 3 నుంచి 17వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. https:cfw.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో వంట మాస్టర్



బాధితుడు మహా లక్ష్మయ్య

గుత్తి: పట్టణానికి చెందిన వంట మాస్టర్ మహా లక్ష్మయ్య సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి రూ. 70 వేలు పోగొట్టుకున్నాడు. వివరాలు.. మహా లక్ష్మయ్యకు గత నెల 27న ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. తమ వద్ద పాత ఐదు రూపాయల నోట్లు ఉన్నాయని, వాటిని తాము చెప్పిన చోట అమ్ముకుంటే భారీగా డబ్బులొస్తాయని ఆశ చూపాడు. తమ వద్ద ఉన్న ఆ నోట్లు పంపాలంటే ముందుగా డబ్బు పంపాలని సూచించాడు. దీంతో ఆశపడ్డ మహాలక్ష్మయ్య వెనుకా ముందూ ఆలోచించకుండా వారు చెప్పిన నంబర్‌కు రెండు సార్లు కలిపి మొత్తం రూ. 70 వేలు పంపాడు. ఆ తర్వాత ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. లబోదిబోమంటూ గురువారం పోలీసులను ఆశ్రయించాడు.

రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి

అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా పేర్కొన్నారు. గురువారం ఉపాధి హామీ పథకం ఏపీడీలు, ఏపీలతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రూ.100 కోట్ల నిధులతో బీటీ రోడ్లు, సీసీ రోడ్ల పనులు చేపడుతున్నారన్నారు. పనుల నాణ్యతను నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఎక్కడా నాణ్యత లోపం లేకుండా పనులు జరిగే విధంగా కాంట్రాక్టర్లకు ఆదేశాలివ్వాలన్నారు. మార్చి లోపు పనులు పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండలంలో వ్యక్తిగత ఇంకుడు గుంతలు తవ్వుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్రతి మండలానికి 1,000 చొప్పున జిల్లా వ్యాప్తంగా 31 వేల ఇంకుడు గుంతలు మంజూరైనట్లు తెలిపారు. వేగవంతంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు.

ఈ బీమా మాకొద్దు..



గత వైఎస్ జగన్ ప్రభుత్వం అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలిచింది. రైతులపై పైసా భారం పడకుండా ఉచితంగా ప్రీమియం చెల్లించి బీమా పరిహారం చెల్లించింది. కానీ, కర్షకులపై శీతకన్నేసిన చంద్రబాబు ప్రభుత్వం రైతులను పంటల బీమాకు దూరం చేసింది. ప్రీమియం భారం మోపడంతో అన్నదాతలు ఆసక్తి కనబరచ లేదు. సగం మంది బీమా వద్దనుకున్నారు.

- ప్రీమియం భారంతో బీమాపై రైతుల అనాసక్తి
- గడువు పొడిగించినా స్పందన కరువు
- 70 వేల హెక్టార్లకు గానూ 35,500 హెక్టార్లకే ప్రీమియం చెల్లింపు

అనంతపురం అగ్రికల్చర్: పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం విధించిన గడువు ముగిసింది. ఈ రబీలో వాతావరణ ఆధారిత, ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకాల కింద పప్పుశనగ, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, వరి, టమాట, మామిడి పంటలకు బీమా వర్తింపజేశారు. ఇందులో వ్యవసాయ పంటలకు రైతులు తమ వాటా కింద 1.5 శాతం, మామిడి, టమాటకు 5 శాతం మేర ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పప్పుశనగ రైతులు ఎకరాకు 450, వేరుశనగ రైతులు ఎకరాకు రూ.480, జొన్న- రూ.315, మొక్కజొన్న–రూ.525, వరి– రూ.630,టమాట – రూ.1,600, మామిడి రైతులు ఎకరాకు రూ.1,650 ప్రకారం ప్రీమియం చెల్లించాల్సిందేనని నిబంధన విధించారు. వరి మినహా మిగతా అన్ని పంటలకు ప్రీమియం చెల్లింపు గడువు డిసెంబర్ 15గా నిర్ణయించారు. అయితే 34 శాతం మంది మాత్రమే బీమా పథకాల్లో చేరడం, 64 శాతం మంది మిగిలిపోవడంతో డిసెంబర్ నెలాఖరు వరకు గడువు పొడిగించారు. అయినా ఈ 15 రోజుల్లో మరో 14 శాతం మంది రైతులు మాత్రమే ప్రీమియం చెల్లించడం గమనార్హం. మొత్తంగా 70 వేల హెక్టార్లకు ప్రీమియం చెల్లిస్తారని అధికారికంగా అంచనా వేయగా.. చివరకు 35,500 హెక్టార్లకు ప్రీమియం చెల్లించినట్లు చెబుతున్నారు. అంటే సగానికి సగం మంది రైతులు పంటల బీమా పథకాల్లో చేరడానికి, ప్రీమియం కట్టడానికి ఆసక్తి కనబరచలేదు. అయినా సగం మంది కట్టిన ప్రీమియమే రూ.5 కోట్ల వరకు ఉండటం విశేషం.

గత ఐదేళ్లూ నిశ్చింతగా..

గత ఐదేళ్లూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఖరీఫ్, రబీలో ఉచితంగా వాతావరణ, ఫసల్ బీమా పథకాలు అమలు చేసింది. రైతులపై పైసా కూడా భారం లేకుండా పరిహారం అందజేసింది. ఈ–క్రాప్, ఈ–కేవైసీ చేయించుకుంటే చాలు పథకాలు దరిజేర్చారు. నిబంధనల మేరకు బీమా కింద ఏటా జూన్, జూలైలోనే పరిహారం కూడా జమ చేశారు. గత ప్రభుత్వ హయాంలో తొలిసారిగా ఉద్యాన పంటల రైతులకు కూడా పెద్ద మొత్తంలో పరిహారం ఇచ్చారు. గత ఐదేళ్లూ విస్తారంగా వర్షాలు కురిశాయి. పంట దిగుబడులు కూడా బాగానే వచ్చాయి. అయినా, ఉచిత పంటల బీమా పథకాల కింద 14.20 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.1,883 కోట్లు అందించారు.

అన్నదాతల కన్నెర్ర..

కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తమ కష్టాలను పట్టించుకోకుండా బీమా ప్రీమియం భారం మోపడంపై రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబును నమ్మి దారుణంగా మోసపోయామని వాపోతున్నారు. రానున్న ఖరీఫ్‌లో ప్రీమియం రూపంలో జిల్లా రైతులపై ఏటా రూ.100 కోట్ల వరకు భారం పడనుందని అంచనా వేస్తున్నారు. ఇలా రూ.కోట్లలో తమ నెత్తిన భారం వేస్తున్న చంద్రబాబు ప్రభుత్వంపై అన్నదాతలు తీవ్రంగా మండిపడుతున్నారు. గత ఐదేళ్లూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాలు అమలు చేయడంతో చీకు చింతలేకుండా పోయిందని గుర్తు చేసుకుంటున్నారు. అంతేకాకుండా నిబంధనల మేరకు పెద్ద ఎత్తున పరిహారం కూడా అందించారని చెబుతున్నారు. కూటమి సర్కారులో సమస్యలు మళ్లీ మొదటికొచ్చాయని ఆవేదన చెందుతున్నారు.

'రబీ' విస్తీర్ణం, ప్రీమియం చెల్లించిన రైతుల వివరాలు..

పంటల సాగు	70 వేల హెక్టార్లు
బీమా ప్రీమియం చెల్లింపు	35,500 హెక్టార్లు
రైతులపై మోపిన భారం	రూ.5 కోట్లు..
పంటల వారీగా ఎకరాకు ప్రీమియం ఇలా..	
పప్పుశనగ	రూ.450,
వేరుశనగ	రూ.480
జొన్న	రూ.315
మొక్కజొన్న	రూ.525
వరి	రూ.630
టమాట	రూ.1,600
మామిడి	రూ.1,650

ఎంతో లాభం చేకూర్చిన ఉచిత బీమా పథకాలను రద్దు చేసి ప్రీమియం చెల్లించాలని మెలికపెట్టడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

ఇదెక్కడి న్యాయం?



11 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. ఇప్పటికే పంటలు పండక, ఆర్థిక ఇబ్బందులతో నలిగిపోతున్నాం. ఇలాంటి తరుణంలోనూ 'బీమా' పిడుగు మాపైనే పడింది. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించింది. ప్రస్తుతం రైతులతో కట్టిస్తున్నారు. ఇదెక్కడి న్యాయమో అర్థం కావడం లేదు.
– శివకామేశ్వర్ రెడ్డి, రైతు, పాతపల్లి, యల్లనూరు మండలం

నమ్మకం లేక కట్టలేదు



నాకు నాలుగున్నర ఎకరాల పొలం ఉంది. ప్రస్తుతం పప్పుశనగ పంట సాగు చేశా. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రస్తుతం రబీ సీజన్‌కు సంబంధించి పంటలకు రైతులే ప్రీమియం చెల్లించుకోవాలని చెబుతున్నారు. అయితే, ప్రీమియం చెల్లించినా బీమా వర్తిస్తుందన్న ఆశ లేదు. అందుకే డబ్బు కూడా కట్టలేదు. గత ఐదేళ్లూ రైతుల ఇంటి వద్దకే అన్ని పథకాలు అందాయి.
– లాలుస్వామి, రైతు, రాగులపాడు, వజ్రకరూరు మండలం

గత ప్రభుత్వం ఎంతో మేలు చేసింది



ఈ క్రాప్ చేయించుకుంటే చాలు వైఎస్సార్ ఉచిత పంటల బీమా వర్తించేలా గత ప్రభుత్వమే ప్రీమియం చెల్లించింది. అన్నదాతలకు ఎంతో మేలు చేసింది. కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాను కొనసాగించకపోవడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పప్పుశనగ సాగు చేసిన వారు ఎకరాకు రూ.450 చెల్లించడం భారంగా మారడంతో చాలా మంది వదిలేశారు.
–సుదర్శన్, కోమటికుంట్ల గ్రామం, పుట్లూరు మండలం

తాత్కాలిక సీనియార్టీ జాబితా సిద్ధం

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్, ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల పరిధిలోని పాఠశాలలకు సంబంధించి పీఎస్ హెచ్‌ఎం, తెలుగు, హిందీ, ఉర్దూ స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు తాత్కాలిక సీనియార్టీ జాబితా సిద్ధం చేశారు. https:// deoananthapuramu.blogspot.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాను పరిశీలించి ఏవైనా అభ్యంతరాలుంటే శుక్రవారం సాయంత్రం 5 గంటలలోపు సరైన ఆధారాలతో హెచ్‌ఎం, ఎంఈఓల ద్వారా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

7 నుంచి కేంద్ర బృందం పర్యటన

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఖరీఫ్‌లో నెలకొన్న కరువు పరిస్థితులను తెలుసుకునేందుకు ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకూ ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం పర్యటించనున్నట్లు వ్యవసాయశాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. ఈనెల 2,3 తేదీల్లో పర్యటన ఉండగా వాయిదా పడిన విషయం తెలిసిందే. అనంతపురం జిల్లాలో 7, శ్రీ సత్యసాయి జిల్లాలో 10 మండలాలను కరువు జాబితాలో ప్రకటించారు. వ్యవసాయ అధికారులు ఆయా మండలాల్లో పంట నష్టం అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. రూ. 19 కోట్ల వరకూ నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే కరువు బృందం జిల్లాల పర్యటనకు రానుంది.

నేడు ఎంఈఓ-1,2లకు ఓరియంటేషన్



అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ (సహిత విద్య) విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మండల విద్యాశాఖ అధికారులు–1,2లకు ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల కోసం సహిత విద్య ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలు, బడిబయట పిల్లలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించడం తదితర అంశాలపై ఓరియంటేషన్ ఉంటుందని డీఈఓ, సమగ్రశిక్ష ఏపీసీ ప్రసాద్‌బాబు తెలిపారు. పరిశీలకులుగా ఎస్పీడీ ఐఈడీ విభాగం నుంచి నరసింహ, మల్లికార్జున హాజరవుతున్నారన్నారు. స్థానిక సైన్స్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభవుతుందని, ఎంఈఓలు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయం

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం అనంతపురంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ మలోల శుభాకాంక్షలు తెలిపారు. వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు పూలమొక్కలు, పుస్తకాలు తదితర సామగ్రి అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. వేడుకలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను, జేఏసీ అమరావతి, కో–ఆపరేటివ్ క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు సత్వరం అందించాలన్నారు. కొత్త సంవత్సరంలో లక్ష్యాలను నిర్దేశించుకుని నూతనోత్సాహంతో వాటిని అధిగమించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, జేఏసీ అమరావతి చైర్మన్ దివాకర్‌రావు, మహిళ విభాగం చైర్‌పర్సన్ సురేఖరావు, జేఏసీ ప్రధాన కార్యదర్శి పీఎస్‌ఖాన్, సంఘాల నాయకులు మురళీధర్, లక్ష్మీనారాయణ, పునీత్‌బాబు, సురేఖరావు, కృష్ణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, నాయకులు

పాఠశాలకు టీచర్లు రావడంలేదు

- ఫోన్‌ఇన్‌లో కలెక్టర్‌కు ఓ వ్యక్తి ఫిర్యాదు

అనంతపురం అర్బన్:''ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదు. పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది'' అంటూ కలెక్టర్ వి.వినోద్ కుమార్‌కు ఓ వ్యక్తి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక ఆకాశవాణి కేంద్రం నుంచి 'అనంత మిత్ర ఫోన్‌ఇన్' కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

- 'అనంతపురం రామచంద్రానగర్‌లోని ఛత్రపతి శివాజీ నగర పాలక పాఠశాలలో నా కుమార్తె ఒకటో తరగతి చదువుతోంది. మూడు నెలల నుంచి గమనిస్తున్నా. స్కూల్‌కు ఉపాధ్యాయులు సక్రమంగా రావడంలేదు. ఒక్కో రోజు ఒక ఉపాధ్యాయుడు మాత్రమే హాజరవుతారు. సమస్యను డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా మార్పు రాలేదు' అని చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందిస్తూ... పాఠశాలను తనిఖీ చేసి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి పంపించాలని నగర పాలక కమిషనర్‌ను ఆదేశించారు.
- లలితా నగర్‌కు చెందిన శారద మాట్లాడుతూ తమ ప్రాంతంలో రోడ్డు, తాగునీరు, వీధి దీపాలు, కాలువ తదితర సదుపాయాలు లేవని, బళ్లారి బైపాస్ నుంచి టవర్‌క్లాక్ వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పారిశుధ్యం లోపించిందని, జాతీయ రహదారిలో లైట్లు లేవని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై లైట్లను వారంలోగా ఏర్పాటు చేస్తామన్నారు. మిగతా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.
- తమ పంచాయతీలో కాలువ, రోడ్డు సమస్యలు ఉన్నాయని యాడికికి చెందిన గురుమూర్తి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. అనంతపురం నగర పరిధిలో 'సులభ్ కాంప్లెక్స్'ల నిర్వహణ సరిగా లేదని, జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని అనంతపురానికి చెందిన నరసింహారెడ్డి చెప్పగా.. తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఆర్‌డీ విశ్వనాథ్, నగర పాలక కమిషనర్ రామలింగేశ్వర్, ఆకాశవాణి డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



అనంతపురం తపోవనంలోని చౌక దుకాణం ముందు గురువారం లబ్ధిదారుల క్యూ



రెండో రోడ్డులోని దుకాణం వద్ద చంటిబిడ్డలతోనే వేచి ఉన్న మహిళలు

పస్తులుండలేక పడబాట్లు

పనులు మానుకుంటున్నారు. బారులు తీరుతున్నారు. సర్వర్ సతాయింపులతో మళ్లీ మళ్లీ తిరుగుతున్నారు. అవస్థలు పడుతూనే సరుకులు తీసుకెళ్తున్నారు. దుకాణాల వద్దకే వచ్చి రేషన్ సరకులు తీసుకోవాలని కూటమి సర్కారు ఆదేశాలు జారీ చేయడంతో నెలానెలా పేదల అవస్థలు చెప్పనలవిగా మారాయి. చంటిబిడ్డల తల్లులు, వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే వచ్చి రేషన్ పంపిణీ చేయడంతో ఇబ్బందులే ఉండేవి కావని పేద ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. మంచి కార్యక్రమానికి చంద్రబాబు సర్కారు మంగళం పాడి తమకు కష్టాలు తెచ్చిపెట్టిందంటూ నిట్టూరుస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



బియ్యం సంచి తీసుకెళ్లేందుకు అవస్థలు పడుతున్న మహిళ

టీడీపీ కార్యకర్తల దాడి



గాయపడిన మాధవ

తాడిపత్రి రూరల్: మండలంలోని గంగాదేవిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు మాధవపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు గురువారం కట్టెలతో దాడి చేశారు. బాధితుడు తెలిపిన మేరకు... పాల వ్యాపారంతో జీవనం సాగిస్తున్న మాధవ... గ్రామంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండేవాడు. ఈ అంశం నచ్చని టీడీపీ కార్యకర్తలు ప్రతాపరెడ్డి, రామాంజులరెడ్డి, చింతకుంట రామాంజులరెడ్డి, జయరామిరెడ్డి గురువారం ఉదయం జేసీబీని అడ్డుగా పెట్టి పొలం నుంచి వస్తున్న మాధవపై దాడి చేశారు. గాయపడిన బాధితుడు.. తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకుని రూరల్ అప్‌గ్రేడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్లుప్తంగా

ఐచర్ బోల్తా - 200 కోళ్ల మృతి


ట్రేలను వెలికి తీస్తున్న దృశ్యం

బెళుగుప్ప: పౌల్ట్రీ ఫారం నుంచి బయలుదేరిన ఐచర్ వాహనం బోల్తాపడిన ఘటనలో 200 కోళ్లు మృతి చెందాయి. వివరాలు.. కళ్యాణదుర్గంలోని పౌల్ట్రీ ఫారం నుంచి గుంతకల్లు పట్టణానికి కోళ్ల లోడుతో గురువారం ఉదయం ఐచర్ వాహనం బయలుదేరింది. బెళుగుప్ప మండలం దుద్దేకుంట గ్రామ సమీపంలోకి చేరుకోగానే హంద్రీ-నీవా కాలువ మలుపు వద్ద డ్రైవర్ వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో వాహనం బోల్తాపడింది. ట్రేలన్నీ తిరగబడడంతో దాదాపు 200 కోళ్ల మృతి చెందాయి. డ్రైవర్ విజయ్‌కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశం

అనంతపురం క్రైం: డీఆర్‌డీఏ – సీడాప్, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద మండల స్థాయిలో జిల్లా రీసోర్స్ పర్సన్ల (డీఆర్‌పీ)గా పనిచేసే అవకాశాన్ని నిరుద్యోగులకు కల్పించనున్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒక్కొక్కరికి నెలకు రూ.20 వేలు చొప్పున ప్రోత్సాహక వేతనంగా మొత్తం 31 మందిని భర్తీ చేయనున్నారు. ఎంపికైన వారు మండలాల్లో ఎంటర్‌ప్రైజెస్ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుంది. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి, కంప్యూటర్, ఇంటర్నెట్ ఉపయోగించడంలో నైపుణ్యం కలిగి ఉండాలి. ఫుడ్ ప్రాసెసింగ్ లేదా సహజ అభివృద్ధి కార్యకలాపాలలో అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యతనిస్తారు. 21 నుంచి 30 ఏళ్ల వయస్సు, ఆసక్తి ఉన్న పురుష, స్త్రీ, ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులు ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 8న అనంతపురం నగర శివారులోని ధర్మవరం పంగల్ రోడ్డులో ఉన్న టీటీడీసీలో జరిగే ఇంటర్వ్యూలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలి. పూర్తి వివరాలకు 89850 91256, 86394 39808, 86394 48535, 77309 30919లో సంప్రదించవచ్చు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

వజ్రకరూరు: మండలంలోని పీసీ.ప్యాపిలి తండాకు ఆదినారాయణ నాయక్‌ను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వజ్రకరూరు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. మూడు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఆదినారాయణ నాయక్ తన వెంట పిలుచుకుని వెళ్లాడు. ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు డీఎస్పీ శ్రీనివాస్ విచారణ చేపట్టారు. గురువారం మధ్యాహ్నం పీసీ ప్యాపిలి బస్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న ఆదినారాయణ నాయక్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఒక్క పిలుపు... వంద మంది పలుకు

- గ్రామంలో ప్రతి ఇంటా ఇద్దరు, ముగ్గురికి గ్రామదేవతల పేర్లు
- ఏటా సుంకులమ్మ, ముత్యాలయ్య జాతర


ఆలయంలోని సుంకులమ్మ, ముత్యాలయ్య మూలవిరాట్‌లు

రామరాజుపల్లిలో వెలసిన గ్రామ దేవతల ఆలయం

సమ్‌థింగ్ Special

పామిడి: ఏ పల్లెలోనైనా ఒకే పేరు ఉన్న వారు ఐదారు మంది ఉంటే గొప్ప. అలాంటిది ఆ ఊళ్లో దాదాపు వెయ్యి మందికి పైగా ఒకే పేరు పెట్టుకున్నారు. సుంకులమ్మ అనో... ముత్యాలయ్య అనో కేక వేస్తే చాలు పదుల సంఖ్యలో పోగవుతారు. తమ ఇలవేల్పును నిత్యం స్మరించేలా ఇలా గ్రామ దేవతల పేర్లు పెట్టామని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇంతకు ఆ గ్రామం ఏదంటే... పామిడి మండలం రామరాజుపల్లి. గ్రామంలో 340 కుటుంబాలకు గాను 1,400 మంది జనాభా ఉన్నారు. వీరిలో ఓ వెయ్యి మందికి ముత్యాలయ్య, ముత్యాలరెడ్డి, ముత్యాలమ్మ పేర్లు ఉన్నాయి. అలాగే మరో 400 మందికి సుంకులమ్మ, సుంకిరెడ్డి, సుంకన్న తదితర పేర్లు ఉన్నాయి. ఇంత మంది ఒకే పేరు పెట్టుకోవడానికి కారణం ఏమని ఆరా తీస్తే.. ఆ గ్రామస్తులు ఓ పురాతన కథ వినిపిస్తున్నారు. ఆ కథ ఏమిటో తెలుసుకుందాం రండి...

అక్కాతమ్ముళ్లుగా జన్మించి....

రామరాజుపల్లి గ్రామం ఏర్పడినప్పుడు రెడ్ల సామాజిక వర్గానికి చెందిన గణేశం వంశంలో సుంకులమ్మ, ముత్యాలయ్య అక్క, తమ్ముడిగా జన్మించారు. దైవాంశసంభూతులైన వారి మహిమతో గ్రామం సస్యశ్యామలంగా ఉంటూ వచ్చింది. గ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చిన వారు తీరుస్తూ వచ్చారు. దీంతో స్థానికులు వారిని గ్రామ దేవతలుగా ఆరాధించేవారు. కాలక్రమేణ వారు అంతర్ధానమైన తర్వాత గ్రామంలో ఆలయాన్ని నిర్మించి, నిత్య పూజలు చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తమ ఇలవేల్పు పేరును సదా స్మరించేలా తమ సంతానానికి గ్రామ దేవతల పేర్లు పెడుతూ వచ్చారు.

ఏటా తిరునాల

దాదాపు 250 సంవత్సరాలుగా రామరాజుపల్లిలో సుంకులమ్మ, ముత్యాలయ్య తిరునాలను ఏటా నిర్వహిస్తూ వస్తున్నారు. రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి అనంతపురం గ్రామాల మధ్య ఐదురోజులపాటు సాగే ఈ తిరునాలకు జిల్లా వాసులతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, తెలంగాణ నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. తిరునాల సందర్భంగా నిర్వహించే రథోత్సవం చాలా వైవిధ్యంగా ఉంటుంది. ప్రధానంగా ఓ ఎద్దుల బండికి తాటిచెట్టు కాండాన్ని తాళ్లతో కట్టి అలంకరించి రథంగా భావిస్తారు. అనంతరం ఏడు జతల ఎద్దులను కట్టి రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి అనంతపురం వరకూ లాగిస్తారు. ఎద్దులు బండిని లాగే క్రమంలో తాటి చెట్టు కాండం పైపైకి లేస్తూ ఉంటుంది. ఎద్దులు ఎంత బలంగా బండిని లాగితే కాండం అంత పైకి లేస్తుంది. ఆ సమయంలో రథం వెంబడి సుంకులమ్మ, ముత్యాలయ్య ఉత్సవ మూర్తులను చిలకమ్మ పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్తారు. తొలిరోజు గుత్తి అనంతపురానికి చేరిన రథం మరుసటి రోజు రాత్రికి రామరాజుపల్లికి చేరుతుంది. తిరిగి మూడోరోజు రాత్రికి బయలుదేరి నాల్గో రోజుకు గుత్తి అనంతపురానికి చేరుతుంది. ఆ రోజు రాత్రి అక్కడే బస చేస్తారు. ఐదో రోజు తెల్లవారుజామున తిరిగి బండిని రామరాజుపల్లికి చేర్చడంతో తిరునాల ముగుస్తుంది. ముగింపు రోజున గ్రామంలో దేవర నిర్వహించి, మొక్కులు తీర్చుకుంటారు.



సుడిబండి రథోత్సవం (ఫైల్), చిలకమ్మ పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

భక్తి భావానికి నిదర్శనం



ఎంతో మహిమాన్వితంగా భావిస్తూ మేము ఆరాధించేసుంకులమ్మ, ముత్యాలయ్య గ్రామ దేవతల వల్లనే మా ఊరు సుభిక్షంగా ఉంటోంది. గ్రామ దేవతల పేర్లు లేని ఇల్లు లేదు. ఈ పేర్లు పెట్టుకుంటే ఆ కుటుంబంలో ఎలాంటి లోటు పాట్లు ఉండవన్నది మా పెద్దల కాలం నుంచి విశ్వసిస్తూ వస్తున్నాం. ఇది మా గ్రామస్తులకు గ్రామదేవతలపై ఉన్న భక్తిభావానికి నిదర్శనం.

– డీసీ ముత్యాలరెడ్డి, సర్పంచ్, రామరాజుపల్లి గ్రామం, పామిడి మండలం

ఊరు సుభిక్షంగా ఉంటుందని



ప్రతి ఇంట్లోనూ సుంకులమ్మ, సుంకిరెడ్డి, ముత్యాలయ్య, ముత్యాలమ్మ, ముత్యాలరెడ్డి తదితర పేర్లను పెడుతుంటారు. ఇలా చేయడం వల్ల మహిమాన్వితులైన గ్రామదేవతల పేర్లు సదా ఉచ్ఛరించేలా ఉంటుందని అందరూ భావిస్తున్నారు. గ్రామ దేవతల వల్లనే మా ఊరు సుభిక్షంగా ఉందని అందరూ విశ్వసిస్తున్నాం. అందుకే ఏటా గ్రామంలో గ్రామ దేవతలకు జాతర ఉత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తుంటాం.

– భోగాతి మురళీమోహన్‌రెడ్డి, ఎంపీపీ, రామరాజుపల్లి గ్రామం, పామిడి మండలం

30 ఏళ్లు పైబడిన వారికి పరుగు పోటీ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 30 ఏళ్ల పైబడి 100 ఏళ్ల వయసు వరకూ ఉన్న మహిళలు, పురుషులకు పరుగు, స్పీడ్ వాక్ పోటీలను ఈ నెల 5న నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా మాస్టర్స్ అథెటిక్స్ పరుగు పోటీలు 2024–25 పోస్టర్లను కలెక్టర్ వి.వినోద్‌కుమార్, శాప్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌బాబు ఆవిష్కరించారు. పోటీల గురించి సుధాకర్‌బాబు వివరిస్తూ... అనంతపురంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యఅతిథులుగా కలెక్టర్‌తో పాటు, ఎస్పీ జగదీష్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, శాప్ రాష్ట్ర అధ్యక్షుడు రవినాయుడు హాజరవుతారన్నారు. పోటీల్లో పాల్గొనదలిచిన వారు 97018 56200, 95025 39888కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రేపటి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన' పథకం ఈ నెల 4 నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ అమలు కానుంది. జిల్లాలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 11,100 మంది విద్యార్థులకు సమీపంలోని ఉన్నత పాఠశాలల ఏజెన్సీల నుంచి మధ్యాహ్న భోజనం సరఫరా చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. కళాశాలల విద్యార్థుల సంఖ్య ఆధారంగా అదనంగా వంట మనిషి ఏర్పాటు, పాఠశాలలో తయారు చేసిన భోజనాన్ని కళాశాలకు చేర్చే బాధ్యత ప్రిన్సిపాల్‌దేనని అన్నారు. కొత్త ఏజెన్సీలు అవసరమైతే అందుకు కావాల్సిన వంట పాత్రలు కళాశాలలో ఉన్న నిధులతో కొనుగోలు చేయాలని ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్ సూచించారు. ఎలాంటి ఆటంకం లేకుండా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని డీఈఓ, ఆర్‌ఐఓ విజ్ఞప్తి చేశారు.

బెంగళూరులో కళ్యాణదుర్గం యువతి ఆత్మహత్య


రుచిత

దొడ్డబళ్లాపురం (కర్ణాటక): జీవితంపై విరక్తితో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం బెస్తరహళ్లికి చెందిన రుచిత (25) బెంగళూరులోని బయోకాన్ కంపెనీలో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తోంది. తన తల్లిదండ్రులతో కలసి బాగలగుంటలోని మల్లసంద్రలో నివాసముంటోంది. పీణ్యా 2వ స్టేజ్‌లో తల్లిదండ్రులు ఓ దుస్తుల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తల్లిదండ్రులు దుస్తుల దుకాణానికి వెళ్లిన సమయంలో ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న రుచిత ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ క్రమంలో కుమార్తెకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో తల్లిదండ్రులు నేరుగా ఇంటికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమార్తెను చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న బాగలగుంట పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. డెత్ నోట్ ఏదీ లభ్యం కాకపోవడంతో ఆమె మృతికి కారణాలు తెలియరాలేదు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు బాగలగుంట పోలీసులు తెలిపారు.

పశుశాఖ పరిధిలో 12 చెక్‌పోస్టులు

- గాలికుంటు వ్యాధిని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా పశువుల రవాణా, క్రయ విక్రయాలపై ప్రత్యేక నిఘా


పశువుల రవాణా

అనంతపురం అగ్రికల్చర్: పశువులను కబలిస్తూ పాడి రైతులకు నష్టాలు తెచ్చిపెడుతున్న గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీస్- ఎఫ్‌ఎండీ)ని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ మేరకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై ఆయా రాష్ట్రాలకు దిశానిర్దేశం చేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని కర్ణాటక సరిహద్దులు పంచుకున్న 12 ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు పశుశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అనంతపురం జిల్లా పరిధిలో బొమ్మనహాల్, డి.హీరేహాల్, మొలకాల్మూరు రోడ్డు, ఓబుళాపురం, డొనేకల్లు, విడపనకల్లు, యాటకల్లు. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో తూముకుంట, కొడికొండ, కె.బసవనపల్లి, మోదా, యు.రంగాపురం గ్రామాల పరిసరాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు కానున్నాయి. రెండు మూడేళ్లలో గాలికుంటు వ్యాధిని సమూలంగా నిర్మూలించి వ్యాధి రహిత ప్రాంతం (ఎఫ్‌ఎండీ ఫ్రీజోన్)గా ప్రకటించేలా చర్యలు వేగవంతం చేశారు. ఈ క్రమంలో నేషనల్ అనిమల్ డిసీసెస్ కంట్రోల్ బోర్డు (ఎన్‌ఏడీసీపీ) కింద ఒక్కో చెక్‌పోస్టు ఏర్పాటుకు రూ.10 లక్షలు చొప్పున కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే స్థల సేకరణ పూర్తి కాగా త్వరలో అన్ని వసతులతో కూడిన చెక్‌పోస్టు క్యాబిన్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకూ ఎంపీడీవో పరిధిలో పనిచేస్తున్న వీఏహెచ్‌ఏలను చెక్‌పోస్టుల్లో నియమించనున్నారు. దీంతో వారు పూర్తిగా పశుశాఖ పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుంది. క్రయ విక్రయాలు, రవాణా కింద కర్ణాటక నుంచి తరలిస్తున్న పశువులకు జబ్బులు, రోగాల స్థితిగతులను చెక్‌పోస్టు వద్ద అధికారులు పరిశీలిస్తారు. జిల్లాలోకి పశువులను అనుమతించాలంటే తప్పనిసరిగా ఎఫ్అండ్‌డీ వ్యాక్సినేషన్‌కు సంబంధించి సర్టిఫికెట్ చూపించాలనే నిబంధన విధించారు. వీటికి సంబంధించి రోజువారీ నివేదిక సంబంధిత పశువుల డాక్టర్‌కు, జేడీకి, డైరెక్టరేట్‌కు, అక్కడి నుంచి కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు. తొలి విడతగా 12 చెక్‌పోస్టులకు అనుమతి రాగా త్వరలో కర్ణాటకను అనుకుని ఉన్న మరికొన్ని ప్రతిపాదిత చెక్‌పోస్టుల ఏర్పాటుకు కూడా ఆదేశాలు వచ్చే అవకాశం ఉందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

'సివిల్' కేసుల్లో పోలీసుల జోక్యం నశించాలి


అనంతపురం జిల్లా కోర్టు ఎదుట నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

- నిరసన ర్యాలీలో న్యాయవాదులు

అనంతపురం: సివిల్ కేసు వ్యవహారాల్లో పోలీసుల జోక్యం నశించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఐదు రోజుల క్రితం అనంతపురం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శాంతిలాల్ చాంబర్‌లో సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి మృతి చెందిన విషయం తెలిసిందే. విచారణ పేరుతో న్యాయవాది శేషాద్రిని బలిగొన్న సీఐ శాంతిలాల్‌ను సస్పెండ్ చేయాలంటూ న్యాయవాదులు చేపట్టిన నిరసన ర్యాలీ గురువారం ఐదో రోజూ కొనసాగింది. జిల్లా కోర్టు ఎదుట చేపట్టిన నిరసన ర్యాలీలో సీనియర్ న్యాయవాదులు గోవిందరాజులు, వెంకట్రాముడు, బడా నారాయణరెడ్డి, రామలింగారెడ్డి మాట్లాడారు. శేషాద్రి మృతి కేసు విచారణను సీఐడీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. శేషాద్రి మృతిపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ గోవింద్, సీనియర్ న్యాయవాదులు గాజుల ఉమాపతి, హనుమన్న, పుల్లయ్యబాబు, బాలకృష్ణ, రాజారెడ్డి, గడియారం మల్లికార్జున శర్మ, వహీదా, అనురాధ, భాను, బాబా ఫక్రుద్దీన్, శ్రీనివాసరెడ్డి, సతీష్, వీరమాసప్ప, పురుషోత్తం, రాఘవేంద్ర, పద్మజ, పద్మావతి, లక్ష్మి, శ్రీకాంత్‌రెడ్డి, రేవతి, అవ్వ సురేష్, భరత్, భూషణ్ రెడ్డి, రామకృష్ణ, ఎల్‌కే సురేంద్రనాథ్, శ్రీకాంత్, రాఘవేంద్ర, బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, గురువారం జిల్లా న్యాయవాదులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి కర్నూలు జిల్లాలోని అన్ని కోర్టులకు సంబంధించిన బార్ అసోసియేషన్ నాయకులు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. న్యాయవాది బీవీ శేషాద్రి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. సీఐను సస్పెండ్ చేసేంత వరకూ ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. అలాగే తమ నిరసనను మరో మూడు రోజులు కొనసాగించాలని న్యాయవాదులు నిర్ణయించారు. ఇదిలా ఉండగా బార్ అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్‌తో కొంత మంది న్యాయవాదులు వాగ్వాదానికి దిగారు. సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి ఘటనపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మీరు ఎటువైపు ఉన్నారు (మీ స్టాండ్ ఏంటి)అని ప్రశ్నించారు. ఇంత పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరుగుతుంటే మీరు చురుగ్గా ఎందుకు పాల్గొనడం లేదంటూ నిలదీశారు. దీంతో కొందరు న్యాయవాదులు కల్పించుకుని సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టాలి

- కుటుంబసభ్యుల ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థిని కుటుంబ సభ్యులు, జేఏసీ నాయకులు

అనంతపురం అర్బన్: ఇంటర్ విద్యార్థిని చిన్నతిప్పమ్మ అనుమానాస్పద మృతిపై విచారణ చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. విద్యార్థినికి న్యాయం చేయాలి, తేజ కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట బాధిత కుటుంబసభ్యులతో కలసి జేఏసీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడారు. తేజ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న చిన్న తిప్పమ్మ ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయిందని చెప్పడం అనుమానాస్పదంగా ఉందన్నారు. బుధవారం తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు ఉరేసుకుందని చెబుతున్న యాజమాన్యం విద్యార్థిని కుటుంబసభ్యులకు కనీసంగానూ సమాచారం ఇవ్వలేదన్నారు. సరికదా ఉన్నఫలంగా మార్చురీకి మృతదేహాన్ని తరలించారన్నారు. అనంతరం విద్యార్థిని కుటుంబసభ్యులకు, బంధువులకు పొంతన లేని సమాధానాలను యాజమాన్యం ఇవ్వడం చూస్తుంటే అనుమానం మరింత బలపడుతోందన్నారు. దీంతో విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టి, బాధ్యులైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, కళాశాలను సీజ్ చేయాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ మలోలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, బాలు, పీడీఎస్‌యూ శంకర్, వాల్మీకి సేవదళ్ నాయకులు లింగమయ్య, నరేష్, కుటుంబసభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నిందితుల అరెస్ట్

బత్తలపల్లి: మాయమాటలతో రైతులను మోసగించిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. గురువారం స్థానిక పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వారు వెల్లడించారు. పామిడి మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన కందింటి కేశవనారాయణ అలియాస్ శ్రీనివాసులు/శివయ్య, ఆయన కుమారుడు కందింటి నరేష్ కొంత కాలంగా బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో తిరుగుతూ పలువురు రైతులను పరిచయం చేసుకున్నారు. తాము ఆవులు, గేదెలు, ఇతర జీవాలను కొనుగోలు చేస్తామంటూ నమ్మి బలికారు. బత్తలపల్లి మండలం గుమ్మల్లకుంట గ్రామానికి చెందిన బగ్గిరి రామ్మోహన్‌రెడ్డి నుంచి రూ.5 లక్షలు విలువ చేసే ఐదు ఆవులను కొనుగోలు చేశారు. పది రోజులకు డబ్బు చెల్లిస్తామంటూ నమ్మబలికి పత్తా లేకుండా పోయారు. దీంతో బత్తలపల్లిలో వారు నివాసముంటున్న మారుతీనగర్‌కు బాధిత రైతు చేరుకుని ఆరా తీస్తే అప్పటికే వారు ఇల్లు ఖాళీ చేసినట్లుగా చుట్టుపక్కల వారు తెలిపారు. దీంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న రామ్మోహన్‌రెడ్డి గత ఏడాది డిసెంబర్ 27న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో గురువారం నిందితులను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి ఐదు ఆవులు, ఓ గేదెను స్వాధీనం చేసుకున్నారు.

వికటించిన ఆర్‌ఎంపీ వైద్యం

- చికిత్స పొందుతూ వివాహిత మృతి


జ్యోతిబాయి(ఫైల్)

గుమ్మఘట్ట/బ్రహ్మసముద్రం: ఆర్‌ఎంపీ వైద్యం వికటించి ఓ వివాహిత మృతి చెందింది. వివరాలు... బ్రహ్మసముద్రం మండలం రాయలప్పదొడ్డి గ్రామానికి చెందిన జ్యోతిబాయి (31) రెండు రోజుల క్రితం తీవ్రమైన తలనొప్పితో బాధపడుతుంటే కుటుంబ సభ్యులు గుమ్మఘట్ట మండలం భూపసముద్రంలోని ఆర్‌ఎంపీ చిరంజీవి వద్దకు పిలుచుకెళ్లారు. పరిశీలించిన ఆర్‌ఎంపీ ఆమెకు ఓ ఇంజక్షన్ వేసి ఇంటికి పంపాడు. ఇంటికి చేరుకున్న కాసేపటికే ఇంజక్షన్ వేసిన చోట వాపు వచ్చింది. అంతేకాక తలనొప్పి మరింత ఎక్కువ కావడంతో కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఆస్పత్రికి పిలుచుకెళ్లారు. పరీక్షించిన అక్కడి వైద్యులు ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు నిర్ధారించి, వెంటనే అనంతపురానికి రెఫర్ చేశారు. దీంతో కుటుంబసభ్యులు అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక గురువారం ఆమె మృతి చెందింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త రవినాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆర్‌ఎంపీ వేసిన ఇంజక్షన్ వికటించిండం వల్లనే ఆమె మృతి చెందినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎంపిక


ఎంపికైన నూతన కార్యవర్గంతో ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్: వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని గురువారం అనంతపురంలోని కృషి భవన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శశిధర్‌రెడ్డి, కార్యదర్శిగా నరసింహ, సహాధ్యక్షుడిగా ఆనందరాజు, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, నారాయణస్వామి, శివకుమార్, రామలింగారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా నాగభూషణం, అనిల్, రాజేష్, మోహన్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రాజ్యలక్ష్మి, ఖాద్రి, ఈసీ సభ్యులుగా లీలావతి, వెంకటేశ్వర్లు, రహంతుల్లా, రాష్ట్ర ఈసీ సభ్యులుగా శశికళ, హేమంత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర అసోషియేట్ ప్రెసిడెంట్ రూపేష్‌కుమార్, ఆనందరాజు, సురేంద్ర, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, నరసింహ, కడప జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌గౌడ్, ఉమ్మడి జిల్లా నుంచి వ్యవసాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం జేడీఏ ఉమామహేశ్వరమ్మను నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో అనూషకు చోటు


ఫ్రెండ్లీ మ్యాచ్‌లో తలపడిన ఎం. అనూష

అనంతపురం: మండల కేంద్రం ఆత్మకూరుకు చెందిన ఎం.అనూష... భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ఇప్పటికే అండర్ 20 కేటగిరీలో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో చోటు దక్కించుకున్న అనూష... గురువారం బెంగళూరు వేదికగా మాల్దీవుల జట్టుతో జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భారత్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించారు. తనదైన ఆట తీరుతో బంతిని శరవేగంగా అందిస్తూ మాల్దీవుల మహిళల ఫుట్‌బాల్ జట్టుపై 11-1 తేడాతో భారత జట్టు ఘన విజయం సాధించడంలో ఆమె కీలకంగా మారారు. దీంతో ప్రధాన జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకున్న ఆమె ఇకపై అన్ని టోర్నీల్లోనూ ఆడనున్నారు. 2021లో ఫౌండేషన్ లాలిగా సహకారంతో ఆర్డీటీ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ శిక్షణ తీసుకున్న అనూష... భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకోవడంపై ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

క్లుప్తంగా

సందడిగా చెస్ పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న అంధులు

అనంతపురం/అనంతపురం కల్చరల్: జాతీయ అంధుల సమాఖ్య ఆధ్వర్యంలో మూడు రోజుల పాటూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ప్రతినిధులు విజయభాస్కర్, నాగార్జున రవి, అంకిరెడ్డి తెలిపారు. స్థానిక కృష్ణ కళామందిరంలో గురువారం చెస్ పోటీలు ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 78 మంది అంధులు పోటీల్లో పాల్గొని అద్భుత మేధస్సుతో ఆకట్టుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేర్వేరు విభాగాల్లో చెస్ పోటీలు కొనసాగాయి. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పోటీలను లాంఛనంగా ప్రారంభించి అంధులను అభినందించారు. శుక్రవారం ఉదయం చివరి దశ చెస్ పోటీలు జరుగుతాయని సమాఖ్య ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో నాగిశివారెడ్డి, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ




ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

రాప్తాడు: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. 2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు భాగంగా రెండు మొక్కలు నాటాలని సూచించారు. వాటిని సంరక్షించేందుకు చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. మొక్కలను మనం కాపాడితే.. అవి మనల్ని కాపాడుతాయన్నారు.

యూనివర్సిటీల పరిరక్షణకు ముందుకురండి

అనంతపురం టవర్‌క్లాక్: యూనివర్సిటీల పరిరక్షణకు విద్యార్థులు ముందుకు రావాలని ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్‌పీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులు ఉద్యోగాలు వస్తాయని ఎంతో ఆశగా ఎదురు చూశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు. విశ్వ విద్యాలయాలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ఇప్పటికైనా విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయాలని కోరారు. లేని పక్షంలో నిరుద్యోగులు కన్నెర్ర చేస్తారన్నారు. యూనివర్సిటీల పరిరక్షణకు పోరాడాలన్నారు.

గంగమ్మ గుడిలో చోరీ



గొల్లపల్లి గంగమ్మ ఆలయం

రాప్తాదు రూరల్: అనంతపురం రూరల్ మండలం కామారుపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గంగమ్మ గుడిలో దొంగలు పడ్డారు. గ్రామస్తులు తెలిపిన మేరకు... బుధవారం రాత్రి 10 గంటల వరకు గ్రామస్తులు గుడి వద్దే ఉన్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రవేశించిన దొంగలు ప్రధాన గేటుకు వేసిన తాళం బద్దలుగొట్టి లోపలికి ప్రవేశించారు. గర్భగుడికి వేసిన తాళం బద్దలు కొట్టి అమ్మవారి మూలవిరాట్‌ను అలంకరించిన వెండి ఆభరణాలు అపహరించారు. అలాగే రెండు హుండీలను ఎత్తుకెళ్లి ఆరుబయలు ప్రాంతంలో ధ్వంసం చేసి అందులోని భక్తుల కానుకలనూ అపహరించారు. గురువారం ఉదయం గుడి వద్దకు వెళ్లిన గ్రామస్తులు చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తే ఓ యువకుడు దొంగతనానికి పాల్పడినట్లుగా దృశ్యాలు ఉన్నాయి. పుటేజీలను స్వాధీనం చేసుకుని, ఆలయ నిర్వాహకుడు మలిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇన్‌చార్జ్ ఏసీపీగా శిరీష

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ టీపీఓగా ఉన్న శిరీషను ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా (ఏసీపీ) నియమిస్తూ కమిషనర్ రామలింగేశ్వర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీపీగా ఉన్న శ్రీనివాసులు నెల రోజుల పాటు సెలవులో వెళ్లిన విషయం విదితమే. ఈ క్రమంలో టీపీఓకు అదనపు బాధ్యతలు అప్పగించారు. నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీ, టీపీఎస్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు గత కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్నాయి.

ప్రభుత్వ బడులకు వరం 'పీఎంశ్రీ'



ఈ ఫొటోలో కనిపిస్తున్న భవనం రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉంది. ఈ భవనాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1.15 కోట్లతో అన్ని హంగులతో నిర్మించారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చిన ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తోంది ఈ పాఠశాల భవనం. ఈ పాఠశాలలో 500 మంది దాకా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. రెండో విడతలో మరో ఆరు అదనపు గదులు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం అవి నిర్మాణం పూర్తి కాకుండానే మధ్యలోనే నిలిచిపోయాయి. మొదటి విడతలో రాప్తాడు ఉన్నత పాఠశాలలో నిర్మించిన భవనం ఒక్కటే కాదు, మొదటి విడతలో మండలంలో 14 పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు కూడా అన్ని హంగులతో నిర్మించారు.



రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- నియోజకవర్గంలో ఐదు పాఠశాలలు పీఎంశ్రీకి ఎంపిక
- గత ప్రభుత్వంలో నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి
- రూపురేఖలు మార్చేసిన మాజీ సీఎం జగన్
- ఐదేళ్ల పాటు బడులకు ఊతం

రాప్తాడు: విద్యా వికాసంతోనే దేశ ప్రగతి సాధ్యం. ఆ విషయాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల్లోని విద్యా సంస్థల అభివృద్ధికి ఇతోధికంగా ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వస్తోంది. దీనిలో భాగంగా ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) అనే పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడం, మౌలిక వసతులు కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను మంజూరు చేస్తే, మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. ఐదేళ్ల పాటు ఈ సాయం అందుతుంది.

రాప్తాడు నియోజకవర్గంలో..

పీఎంశ్రీ పథకం అమలుకు నిర్దేశించిన 46 అంశాల ఆధారంగా రాప్తాడు నియోజకవర్గంలో ఐదు మండలాలల్లో ఐదు పాఠశాలలను గుర్తించి గతేడాది నవంబర్‌లో విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలు పంపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు 60 శాతం మార్కులు, పట్టణ ప్రాంతాల్లోని 70 శాతం మార్కులు సాధిస్తే వాటిని పీఎంశ్రీ పథకం లబ్ధి కోసం ఎంపిక చేస్తారు. రాప్తాడు మండలంలోని రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆత్మకూరు మండలంలోని ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కనగానపల్లి మండలంలోని కనగానపల్లి జిల్లా పరిషత ఉన్నత పాఠశాల, రామగిరి మండలంలోని నసనకొట ఏపీఆర్‌ఎస్ బాలికల పాఠశాల, చెన్నేకొత్తపల్లి మండలంలోని మేడాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఈ పథకానికి ఎంపికయ్యాయి.

మౌలిక వసతుల పెంపు

ఈ పథకం కింద పాఠశాలల్లో విద్యాబోధన సదుపాయాల్లో నాణ్యతా ప్రమాణాల పెంపు, తరగతి గదుల నిర్మాణం, ఇతర వసతుల కల్పన, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బోధన సామగ్రి సమకూర్చనున్నారు. కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్ గార్డెన్, రెయిన్ వాటర్ హార్వెస్టర్, మరుగుదొడ్ల నిర్మాణం, వికలాంగులకు ర్యాంపులు, క్రీడా మైదానాల అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు.

నాడు–నేడుతో మారిన రూపురేఖలు

రాష్ట్రంలోని పాఠశాలల రూపురేఖలు ఇప్పటికే నాడు–నేడు పథకం ద్వారా సమూలంగా మారిపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. పేదింటి బిడ్డలకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో పాఠశాలలను తీర్చిదిద్దడమే కాకుండా అనేక సదుపాయాలు కల్పించారు. ఈ నేపథ్యంలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో అత్యాధునిక హంగులు, డిజిటలైజేషన్ దిశగా చర్యలు చేపడతారు. పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలకు మొదటి విడత నిధులు ఇప్పటికే మంజూరయ్యాయి.

విద్యలో రాణించేందుకు అవకాశం



ప్రభుత్వ పాఠశాలలు నాడు–నేడు పథకం ద్వారా అభివృద్ధి చెందాయి. నాడు–నేడు కింద మొదటి విడతలో రూ.1.15 కోట్లతో నాబార్డు నిధులతో మా పాఠశాలలో ఆరు అదనపు గదులను నిర్మించారు. రెండవ విడతలో కూడా మరో ఆరు అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. తాజాగా మా పఠశాల పీఎంశ్రీకి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. మరిన్ని సదుపాయాలతో పాఠశాల అభివృద్ధి చెందనుంది.

– సాంబశివుడు,
హెచ్‌ఎం, రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

దశల వారీగా నిధుల విడుదల



పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలకు దశల వారీగా నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తాయి. పర్యవేక్షణ అంతా ఎంఈఓలదే. డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర సౌకర్యాలతో పాటు ఉపాధ్యాయులకు శిక్షణ, ఆర్థిక, సాంకేతిక సహకారం, సంప్రదాయ విధానాలపై విద్యార్థులకు అవగాహన పాఠశాల ఆవరణలోనే సేంద్రియ విధానంలో కూరగాయల సాగు, అభ్యసన నైపుణ్యంపై విద్యార్థులకు శిక్షణ, బాలికా విద్యాభివృద్ధి, సైన్సు ప్రాజెక్టులు, సోలార్ ప్యానెల్స్, ఎల్‌ఈడీ, దీపాల సౌకర్యం, అన్ని కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు భగస్వామ్యం ఉంటుంది.

– మల్లికార్జున, ఎంఈఓ, రాప్తాడు

27 నుంచి జాతీయ లఘుచిత్రోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సినీ, బుల్లితెర దర్శక నటీనటులు

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా మరో లఘుచిత్రోత్సవానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు అనంతపురం ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి వచ్చే నెల 2 వరకు సాగే చిత్రోత్సవ పోస్టర్లను పారిశ్రామిక వేత్త ముడార్ సుధీర్, జీఎంఎస్ అధినేత సురేష్, దర్శకుడు రషీద్‌బాషా, సామాజిక సేవా కార్యకర్తలు ఏజీ అనిల్‌కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 7వ అనంత జాతీయ లఘుచిత్రోత్సవం అనంత నుంచి సినీ పరిశ్రమకు వెళ్లిన వారి ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటూ నిత్యం లఘు చిత్రాల ప్రదర్శనలతో కనుల పండువగా సాగుతుందన్నారు. ఈనెల 20 లోపు ఆసక్తి కలిగిన నటీనటులు, కెమెరామెన్, రచయితలు, దర్శకులు, ఎడిటర్లు తదితర 18 విభాగాల్లోని పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ముగింపు రోజున జిల్లా వేదికగా సాగే చిత్రోత్సవంలో వారికి మెమెంటోలు, నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించడానికి ఈసారి ప్రత్యేకంగా రెండు రోజుల పాటూ స్క్రిప్ట్ రైటింగ్, ఫిల్మ్ మేకింగ్‌పై శిక్షణనివ్వడమే కాకుండా వారితో సందేశాత్మక చిత్రం నిర్మించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 7288022467, 9676350681 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో తోట బాలన్న, రవీంద్రనాథ్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి, కేవీ రమణ, టీవీ, బుల్లితెర నటుడు రమేష్ నీల్, డాక్టర్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న ఎస్సీ మునిసిపల్ ఉద్యోగుల సంఘం నాయకులు



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, చిత్రంలో శ్రీధర్‌బాబు



కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, తదితరులు

అనంతపురం అర్బన్: ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఎస్సీ మునిసిపల్ ఉద్యోగుల సంఘం నాయకులకు సూచించారు. గురువారం కలెక్టర్‌ను క్యాంపు కార్యాలయంలో సంఘం నాయకులు కలిశారు. పూలమొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపాలు, అజయ్‌బాబు, ఓబులేసు, రాజమ్మ, జ్యోతి, మేరీ, పద్మా, శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

రాప్తాడు: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శివ కృష్ణ, ఎంఈఓ మల్లికార్జున, ఏఓ శేఖర్ రెడ్డి కేక్ కట్ చేసి అధికారులు, ప్రజలు, రైతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. ఎంపీపీ చాంబర్‌లో అధికారులు ఎంపీపీ హేమలతకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఓ సుజాత, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో..

అనంతపురం మెడికల్: ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. అలాగే ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏపీ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ఆవిష్కరించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు సుదర్శన్, మధుబాబు, మస్తాన్, అరుణకుమారి, తనూజ, సుజాత, లలిత, స్టాఫ్‌నర్సు అసోసియేషన్ కోశాధికారి సంధ్య అరుణ, ఈసీ సభ్యులు వై శ్రీదేవి, జీ ఆదిత్య దేవి, బీసీ నారాయణ స్వామి, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్లు రజిని, నాగమణి, హెడ్ సిస్టర్లు ఆర్‌బీ పద్మ, మంగమ్మ, భానులత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్‌ను జాతీయ రహదారుల పర్యవేక్షణ ఇంజనీర్ హరిప్రసాద్‌బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములునాయక్, సంఘం నాయకులు రఫీ, సాంబశివమ్మ, వేణు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్, డైరీని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, డీఈఓ ప్రసాద్‌బాబు, ఇంటర్ బోర్డు ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్ ఆవిష్కరించారు. స్థానిక ఉపాధ్యాయ భవనంలో జరిగిన కార్యక్రంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘురామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి, పూర్వ కార్యదర్శి నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, నాయకులు బి.వెంకటేశులు, సతీష్ కుమార్, బొమ్మయ్య, నరేష్, సర్దార్, వెంకటరమణ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం అగ్రికల్చర్: ఏపీ అగ్రికల్చరల్ ఎంప్లాయీస్ సర్వీసు అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన క్యాలెండర్‌ను జేడీఏ ఉమామహేశ్వరమ్మ గురువారం తన చాంబర్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీ రాజేంద్రప్రసాద్, ఎస్ బాలాజీ నాయక్, రమణా రెడ్డి, ప్రాణేష్, రాజగోపాల్, నరసింహులు, సల్మా, లావణ్య, నరసింహ, పద్మావతి, వీరేష్, హఫీజ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఊరి దేవరకు ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గ్రామస్తులు



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాదవ్‌ను ఆహ్వానిస్తున్న దృశ్యం

రాప్తాడు: మండల పరిధిలోని మరూరు గ్రామంలో ఈనెల 21వ తేదీన జరిగే ఊరి దేవరకు రావాలని మాజీ ఎమ్మెల్యే, రాప్తాడు సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను గ్రామస్తులు ఆహ్వానించారు. గురువారం వారు మర్యాదపూర్వకంగా కలిసి ఊరి దేవర ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 16 నుంచి 21 వరకూ ఊరి దేవర జరుగుతుందని తెలిపారు. ఈ దేవరలో ఏ విధమైన అంగళ్లు, హోటళ్లు, వ్యాపారాలు, ఏ రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు కట్టకూడదని తీర్మానించడం జరిగిందన్నారు. జాతరకు తప్పకుండా వస్తామని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, గోరంట్ల మాధవ్ హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు.

సొంతింటి కల నెరవేరేనా?

- పేదలకు కూటమి ప్రభుత్వం షాక్
- నగరంలో 880 ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే అనుమతి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో సొంతింటి కల సాకారం చేసుకుందామన్న లబ్ధిదారులకు నిరాశే మిగులుతోంది. సొంత స్థలం కల్గి ఉన్న వారికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కింద కొత్త ఇంటి నిర్మాణం కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులను జారీ చేసింది. అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో కేవలం 880 మంది ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నగరంలో మొత్తం 50 డివిజన్లలో 74 సచివాలయాల పరిధిలో 77 వేల హౌస్‌హోల్డ్స్ ఉన్నాయి. కాగా వేలల్లో లబ్ధిదారులున్నా.. కనీసం 1000 మందికి కూడా ఇంటి నిర్మాణాలకు అనుమతివ్వలేదు. ఈ లెక్కన డివిజన్‌కు 17 మందికి మాత్రమే అవకాశం కల్పించారు. సొంత స్థలం ఉన్న వారు ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ రామలింగేశ్వర్ పేర్కొన్నారు. వార్డు వెల్ఫేర్, అమినిటీస్ దరఖాస్తులను స్వీకరించాల్సి ఉంటుంది. సచివాలయ సిబ్బంది, కమ్యూనిటీ ఆర్గనైజర్లు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. కొత్త ఇంటి నిర్మాణం దరఖాస్తుతో పాటు లబ్ధిదారుడు భార్య, ఆధార్, రేషన్ కార్డ, బ్యాంకు అకౌంట్ పాస్ బుక్, స్థలం పట్టా, రిజిస్టర్ డాక్యుమెంట్స్, కుల ధ్రువీకరణ పత్రం, రూ.3 లక్షల్లోపు ఆదాయ ధ్రువీకరణ, రెండు పాస్ ఫొటోలు, ఆధార్ కార్డుకు అనుసంధానం చేసిన ఫోన్ నంబర్, బ్యాంకు అకౌంట్‌కు ఎన్‌పీసీఎల్ లింక్ తదితర వివరాలను జత చేయాలి.

సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టం

అనంతపురం కల్చరల్: సమాజానికి సేవ చేసుకునే అవకాశం దొరకడం అదృష్టం. దీనిని వరంగా భావించాలని వక్తలు పేర్కొన్నారు. గురువారం స్పందన కార్యాలయంలో 'స్పందనతో నా అనుభవాలు' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా స్పందన ఆర్గనైజింగ్ ఫౌండర్ చరణ్‌నంద, స్పందన మహిళా సాధికారత ప్రోగ్రాం డైరెక్టర్ లక్ష్మి మాట్లాడుతూ.. స్పందన ఆర్గనైజేషన్ ప్రారంభం నుంచి సాగిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు, వివిధ ప్రాజెక్టుల వివరాలను అందించే విధంగా రూపొందించిన పుస్తకాన్ని లక్ష్మి రచించడం జరిగిందన్నారు. స్పందన ఆర్గనైజేషన్ అన్నదానం, దివ్యాంగులకు పునరావాసం, నిరుపేద విద్యార్థులకు విద్య, నిరాశ్రయ శవాల అంత్యక్రియలు, మహిళా సాధికారత ప్రాజెక్టులు నిర్వహిస్తోందని ఇవన్నీ స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. విజయాలను, అనుభూతులను చక్కగా వివరించే పుస్తకం చదవడం ద్వారా సేవ గొప్పతనాన్ని గురించి తెలుసుకునే అవకాశం వస్తుందన్నారు. సమాజాన్ని మార్చడానికి యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో స్పందన సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

• ట్రాఫిక్ కష్టాలు

నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. ట్రాఫిక్‌ను పర్యవేక్షించాల్సిన ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారు. గురువారం తాడిపత్రి బస్టాండ్ సర్కిల్, పాతూరు వెళ్లే మార్గం, తాడిపత్రి బస్టాండ్ సర్కిల్‌లో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనాలు అడ్డదిడ్డంగా రాకపోకలు సాగించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



పాతూరు మార్కెట్ వద్ద ఆగిపోయిన వాహనాలు



తాడిపత్రి బస్టాండ్ సర్కిల్‌లో వాహనదారులు అడ్డదిడ్డంగా వెళ్లడంతో స్తంభించిన ట్రాఫిక్

ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి



ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉరవకొండ నియోజకవర్గం బెళుగుప్పలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు స్థానికంగానే పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్‌ఐఓ) వెంకటరమణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి మాట్లాడుతూ.. బెళుగుప్పలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు కేజీబీవీ పాఠశాలలోనూ ఇంటర్ విద్యార్థులు ఉన్నారని గుర్తు చేశారు. పబ్లిక్ పరీక్షలు రాసేందుకు ఏటా దాదాపు 20 కిలోమీటర్ల దూరం ఉన్న కళ్యాణదుర్గం వెళ్తున్నారన్నారు. ఉదయం 9 గంటలకే పరీక్షలు ప్రారంభం అవుతుండటంతో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిబంధనల ప్రకారం వంద మందికి పైగా విద్యార్థులుంటే పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాధాజ్యోతి, వంశీ, సహాయ కార్యదర్శి చందు, రాష్ట్ర సమితి సభ్యులు లలిత ఉన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో శుక్రవారం నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని కమిషనర్ రామలింగేశ్వర్ పేర్కొన్నారు. పీఏబీఆర్ నుంచి నీటి సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌కు బళ్లారి బైపాస్ స్టేషన్ వద్ద లీకేజీ ఏర్పడిందని తెలిపారు. పైప్‌లైన్ మరమ్మతులో భాగంగా నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.